క్లుప్తంగా

నేడు రుణ అర్హత మేళా

రెంటచింతల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం క్రెడిట్ క్యాంప్(రుణ అర్హత మేళా)ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. సరోజినీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంబంధించి ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఈ క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 10.30 గం నిర్వహిస్తున్న ఈ రుణ అర్హత మేళలో మండల పరిధిలోని వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు(సెలక్షన్ కమిటీ సభ్యులు) తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

చల్లబడిన వాతావరణం



మాచర్ల: పట్టణంలో ఆదివారం వాతావరణం మధ్యాహ్నం నుంచి చల్లబడి ఒక్కసారిగా చల్లబడింది. పట్టణమంతా ఈదురు గాలులతో ఇబ్బందికర వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా కాయగా ఒక్కసారిగా వాతావారణంలో మార్పులతో ఈదురుగాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనంతరం యథావిధిగా పరిస్థితి నెలకొంది.

భక్తులకు అన్నదానం

మాచర్ల: దుర్గి మండలంలో వేంచేసియున్న శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఆటో స్టాండ్ సమీపంలో ఆటో అసోసియేషన్ అధ్యక్షులు అప్పి శ్రీను ఆధ్వర్యంలో 300 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో స్టాండ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎంకు సన్మానం



మాచర్ల: పిడబ్ల్యూడీ కాలనీలోని ఎంపీపీ హెచ్ఎం తాటి భాస్కర్ బాబు పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. బిగ్ హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజనీ, ఎంఈఓ అల్లి సురేష్ తదితరులు ఉపాధ్యాయుడిగా భాస్కర్ బాబు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



గురజాల : మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ యాదవ్ కార్యాలయంలో జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, ఎం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

గురజాల: పెడదారిపట్టి జీవితం నాశనం చేసుకోవద్దని యువతకు గురజాల సీఐ ఆవుల భాస్కర్ సూచించారు. తల్లిదండ్రులు కష్టాలను దృష్టిలో ఉంచుకుని, బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూస్తూ కాలం వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాలు, ప్రైవేట్ రంగాల ఉద్యోగాల్లో రాణించాలన్నారు. యువత క్రికెట్ బెట్టింగ్‌లు వంటివి వేసి అప్పుల ఊబిలో కొట్టుకుపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను కూడా అలవాటు చేసుకోవద్దన్నారు.

నేడు కోటకట్ల ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



నూజెండ్ల: నేడు మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీకోటకట్ల ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు జరగనున్నాయి. తిరునాళ్ల సందర్భంగా దాట్లవారిపాలెం, తలార్లపల్లె, నూజెండ్ల, మారెళ్ళవారిపాలెం, రెడ్డిపాలెం, గురప్పనాయుడుపాలెం, తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్ల నేపథ్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు, కమిటీ సభ్యులు తెలిపారు.

ఉన్నా..లేనట్లే..!

- సీసీ కెమెరాల నిర్వహణలో నిర్లక్ష్యం
- మరమ్మతులకు గురవుతున్న నిఘా నేత్రాలు
- దొంగతనాలు, నేరాల నియంత్రణకు లభించిన ఫుటేజీ
- రాత్రిళ్లు గస్తీ పెంచాలంటున్న గ్రామీణులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఇటీవల కాలంలో వరుసగా చోరీలు జరుగుతుండటంతో ప్రధాన సెంటర్లలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల పనితీరును పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అదుపు చేయడానికి, ఎప్పుడైన అవాంఛనీయ ఘటనలు, చోరీలు జరిగిన వెంటనే నేరస్తులను గుర్తించడానికి ఈ సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అప్పుడు కొందరు దాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ సీసీ టీవీ కెమెరాల పనితీరుపై గ్రామ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రామంలో వరుసగా చోరీలు జరిగిన సమయంలో ఈ సీసీ టీవీ కెమెరాల ను పరిశీలించారు. కానీ, అవి మరమ్మతులకు గురైనట్లు పోలీసులు సైతం గుర్తించినట్లు వారు గుర్తు చేస్తున్నారు. గతంలో గ్రామంలోని బ్రహ్మయ్య బావి సెంటర్లోని ఓ నివాసంలో, ఉట్ల స్తంభాల సెంటర్లోని ఓ ఇంట్లో, ఎర్రబాలెంలోని ఓ ప్రవేటు స్కూల్ టీచర్ నివాసంలో, బాలవికాస్ స్కూల్ సమీపంలో పాశం కోటిరెడ్డి ఇంట్లో, గ్రామ పంచాయతీ ఎదురుగా మున్నా రాధా నివాసంలో



రెంటచింతల గ్రామంలోని మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి వద్ద సీసీ కెమెరా

చోరీలు జరిగినప్పుడు.. పుటేజీల కోసం చూడగా..ఈ సీసీ టీవీ కెమెరాలు పనిచేయని పరిస్థితి నెలకొంది. దీంతో చోరీలకు పాల్పడిన వారిని గుర్తించలేక పోయారని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో రెంటచింతలలో వరుసగా రేగుల మాన్యంలోని ఓ ఆలయంలో, రామాలయం సెంటర్లో ఓ మెడికల్ షాపులో, శివాలయంలో, ఓ చిల్లర దుకాణంలో, ఆభయాంజనేయ స్వామి ఆలయంలో, ఇటీవల కొద్దిరోజుల వ్యవధిలో గ్రామంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న గుండా రమేష్, ఏరువ ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, తాళ్ళూరి సాంబశివ రావు, మంచి రామకృష్ణ నివాసాలలో చోరీలు జరగడంతో గ్రామస్తులు భయందోళనకు గురౌతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రామంలో చోరీలకు గురైన నివాసాలను గురజాల డీఎస్పీ పి. జగదీష్ సందర్శించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైన గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల పనితీరును పరిశీలించి మరమత్తులకు గురైన వాటిని తొలిగించి స్థానంలో నాణ్యమైన సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో నిఘా ఉండాలి



గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. గ్రామంలో ఏ ప్రాంతంలో చోరి జరిగినా వెంటనే ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాను పరిశీలించి చోరీలకు పాల్పడిన వ్యక్తులను త్వరగా గుర్తించవచ్చు. ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలి.

– ఆదూరి ఇన్నారెడ్డి, రెంటచింతల

అనుమానితులను గుర్తించవచ్చు



జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈ సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా అనుమానితులను గుర్తించవచ్చు. గ్రామంలోని ప్రధానమైన సెంటర్లలో సీసీ టీవీ కెమెరాలను (వీడియో నిఘా వ్యవస్థ) అమర్చడం వలన గ్రామ ప్రజలకు భద్రతతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలను అదుపు చేయవచ్చు. నేరస్తులను త్వరగా నిర్ధారించి వారిని అదుపులోకి తీసుకోవచ్చు.

– నారాయణపురం శ్రీనివాస్, రెంటచింతల

శరవేగంగా దేవాలయ పునర్నిర్మాణ పనులు



రాతి కట్టుబడితో జరుగుతున్న వీరహనుమాన్ దేవాలయ పనులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వీరహనుమాన్ దేవాలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి జగర్లపూడి రామగోపయ్య శర్మ తెలిపారు. ఆదివారం దేవాలయ నిర్మాణ పనులపై గ్రామస్తులు దాతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన దేవాలయ పునర్నిర్మాణ పనులను రాతి కట్టుబడితో రూ.కోటి వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. నరసరావుపేట పట్టణ వాసి కొత్తమాసు శంకరు నిర్మాణ పనుల్లో తన వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. హైదరాబాదుకు చెందిన ప్రేమ్ చంద్ పాల్గొని మాట్లాడుతూ దేవాలయ నిర్మాణ పనుల్లో కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. నూతన దేవాలయంలో నవ అవతార వీరాంజనేయ స్వామి క్షేత్రం,12 అంగులాల శివామహాస్పటిక లింగాకారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు రామగోపయ్య శర్మ వెల్లడించారు. ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, గోరంట్ల హనుమంతరావు, కాసరగడ్డ వెంకటరత్నం, సుబ్బారావు, భక్త బృందం పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

నరసరావుపేట: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ 102 డ్రైవర్ల జీతాల మెరుగుదలను పరిగణలోకి తీసుకొని నూతన టెండర్లు పిలిచి ఆమోదించాలని ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. ఆదివారం స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు పాల్గొని వినతి పత్రం ప్రదర్శించారు. నాయకురాలు డి.శివకుమారి మాట్లాడుతూ మార్చి 31తో గతంలో పిలిచిన టెండర్ ముగిసిపోనుందన్నారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ.7,870లు జీతంతో గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తూ తమ కుటుంబాలను భారంగా అప్పులతో పోషిస్తున్నారన్నారు. వారి



కార్యాలయంలో వినతిపత్రం ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు

వేతనం రూ.18,500లు ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం టెండర్లు పిలిచేటప్పుడు వాహనాల డ్రైవర్లు జీతాల విషయం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ అహమద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ నాయకుల నివాళి

నరసరావుపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో పీడిత వర్గ ప్రజల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని సీఐటీయూ సీనియర్ నాయకుడు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ 94 వర్ధంతి సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పాత్ర కీలకమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లౌకికవాదానికి తూట్లు పొడిచిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో నిరంతరం పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు డి.శివకుమారి పాల్గొన్నారు.

ఘనంగా విప్లవ వీరుల వర్ధంతి..

నరసరావుపేట ఈస్ట్: ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో దేశ స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలని పలువురు వక్తలు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విప్లవ వీరుల వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు కాసా గోపీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

యువతకు ఆదర్శం భగత్‌సింగ్

చిలకలూరిపేట: యువతకు ఆదర్శం సర్దార్ భగత్ సింగ్ అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, నాయకులు సురభిరాజు, మల్లిఖార్జున్, రాంబాబు, నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

కారెంపూడి: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ జరుగుతుందని తహసీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్, జిల్లా కేంద్రాలకు అర్జీదారులు వెళ్లి అర్జీలు ఇస్తున్నారని అలా ఎవరూ వెళ్లవద్దని, అక్కడ అర్జీలిచ్చినా పరిష్కారానికి మళ్లీ ఇక్కడకే వస్తాయని ఆయన తెలిపారు. ఇక్కడ అర్జీ ఇచ్చిన వెంటనే రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని సమస్యలను ఖచ్చితంగా పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

మాచర్ల : స్వాతంత్ర్య సమరయోధుడు, మహనీయుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఏఐవైఎఫ్ నియోజక వర్గ అధ్యక్షులు నర్రా రంగాస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన పోరాటాల గురించి వివరించారు. సీపీఐ టౌన్ కార్యదర్శి మిద్దె పోగు బాబురావుతో పాటు ఏఐవైఎఫ్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిచనున్నట్లు జరుగుతుందని భగవాన్ సేవా సమితి కన్వీనర్ గర్నె నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం సాయిబాబా మందిరంలో జరుగుతుందన్నారు. రాధాస్ హోమియో పతి ఆన్‌లైన్ కన్సల్టేషన్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గుడివాడ హేష్మమందుషా హాజరు కానున్నట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఈ ఉచిత హోమియో వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులు శావల్యాపురంలోని స్వచ్ఛ సంపద కేంద్రంలో జరుగుతాయన్నారు. 24వ తేదీ శావల్యాపురం మండలం, 25, 26 తేదీల్లో నూజెండ్ల మండలం, 27,28 తేదీల్లోవినుకొండ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.

మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉల్లాస్ వారి సౌజన్యంతో 39 పరీక్ష కేంద్రాల్లో 390 మంది మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు నిర్వహించినట్లు ఏపీఎం జి.వాసుబాబు ఆదివారం తెలిపారు. గత రెండు నెలల నుంచి నేర్చుకున్న అంశాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి సీసీ ఖాజావలీ, మేరి కుమారి, తదితరులు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

ఉద్యోగాలకు 150 మంది ఎంపిక

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న వివేకానంద పబ్లిక్‌స్కూల్‌లో ఆదివారం అర్వత్ స్టాఫ్టవేర్ సోల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాలలో సుమారు 12 కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా విద్యార్హత కలిగిన 450 మంది నిరుద్యోగులు ముందస్తు పేర్లు నమోదు చేసుకున్నారు. జాబ్ మేళాకు 350 మంది హాజరయ్యారు. ఇందులో 150 మంది వేరు వేరు కంపెనీలకు ఉద్యోగ అవకాశాల్లో అర్హత పొందారు. మిగిలిన నిరుద్యోగులకు కూడా మరో మారు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని అర్వత్ స్టాఫ్టవేర్ సోల్యూషన్ డైరెక్టర్ యలగాల కృష్ణమరాజుయాదవ్ అన్నారు. వివేకానంద స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అర్వత్ స్టాఫ్టవేర్ సోల్యూషన్ ప్రతినిధులు

దాచేపల్లిలో ఇఫ్తార్ విందు

దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక జామీయా మసీద్‌లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేకంగా నమాజ్ చేశారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు ప్రభుత్వం నుంచి అందించే సాయంతో పాటుగా వ్యక్తిగతంగా తాను కూడా సాయం అందిస్తానని ఎమ్మెల్యే యరపతినేని చెప్పారు. అనంతరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని భోజనం వడ్డించారు. అందరితో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

నేడు కొత్తపల్లిలో బ్రహ్మం గారి తిరునాళ్ల

మాచర్ల రూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల 46వ కల్యాణ మహోత్సవం సోమవారం కొత్తపల్లి గ్రామంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఫౌండర్ అల్లం కోటిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపులో మహిళలతో కోలాట ప్రదర్శన, బాణా సంచాల మధ్య మేళతాళాలతో ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి శ్రీనివాసాచారి నేతృత్వంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.



బ్రహ్మం గారు, గోవిందమ్మ

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య 23వ వార్షికోత్సవాలు ఆదివారం గ్రామస్తులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆలయ పూజారి జిగురు శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు స్వామి వారికి తెల్లవారుఝాము నుంచే మొక్కుబడులు చెల్లించుకుంటూ, అభిషేకాలు చేస్తూ నైవేద్యాలు సమర్పించుకున్నారు. శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల స్వామి వార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిపారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు జరిపారు.



పూజలో పాల్గొన్న భక్తులు

పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం

రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిసెట్టి హనుమంతరావు

దొడ్లేరు(క్రోసూరు): సాగర్ కాలువకు నీరు విడుదల కోసం రైతాంగం జరిపిన పోరాట ఫలితంగా అధికారులు కాలువకు నీళ్లు విడుదల చేయటం జరిగిందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిసెట్టి హనుమంతరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఆదివారం సాగర్ కాల్వ కింద పంటలని రైతు సంఘం నాయకులు పరిశీలించారు. హనుమంతరావు మాట్లాడుతూ సాగర్ కెనాల్‌లోని చింతపల్లి మేజర్ కాల్వకు సాగు నీరు విడుదల చేయాలని మూడు రోజుల క్రితం దొడ్లేరులో రైతు సంఘం ఆధ్వర్యంలో చేసిన పోరాటం వలన అధికారులు నీటిని విడుదల చేయడం జరిగిందని, దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చింతపల్లి మేజర్‌కు కేటాయించబడిన నీటి సామర్థ్యం ప్రకారం కింది స్థాయి అధికారుల పర్యవేక్షణతో కాలువ చివరి భూముల వరకు నీరందించే విధంగా పర్యవేక్షించాలని సాగర్ కెనాల్ ఇరిగేషన్ ఏఈ బండి శ్రీనివాసరావును ఫోనులో ఆయన కోరారు. రైతులు కూడా నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని సమన్వయంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గతంలో దొడ్లేరు గ్రామంలో ఎన్నో రైతాంగ పోరాటాలు జరిగాయని, అందులో భాగంగానే ఇప్పుడు ఎండిపోతున్న పంటలకు సరైన సందర్భంలో నీటిని అందించే విషయంలో రైతులకు న్యాయం జరిగిందని అన్నారు. రైతులు పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటాల వలన భవిష్యత్తులో ఎలాంటి సమస్యలైనా పరిష్కారం అవుతాయని, రైతు సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పడాల రాంకోటేశ్వరరావు, షేక్ మస్తాన్, యామర్తి రాజారావు, తోట శ్రీనివాసరావు, జిడుగు నరసింహారావు, ఆవుల లక్ష్మిరెడ్డి, కొడవటి ఆంధ్రయ్య, సుఖమంచి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.



దొడ్లేరులో ఆయకట్టు పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు, స్థానిక రైతులు

112 మందికి కంటి వైద్య పరీక్షలు

అచ్చంపేట: లీగల్ అవేర్‌నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని తాడువాయిలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్, దూళిపాళ్ల వారిచే ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 43 మందికి కంటి అద్దాలకు, 35 మందికి కాంటాక్ట్ లెన్స్ కోసం రిఫర్ చేశారు. ఈ సందర్భంగా లీగల్ అవేర్‌నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి రెవ.ఫాదర్ పుట్టి అంథోనిరాజు మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటే అన్ని ఇంద్రియాలలో కళ్లు చాలా ముఖ్యమైనవన్నారు. వాటిని కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ఎక్కిరాల మురళి, సలికేటి సంహరాయలు, వైద్య సిబ్బంది రత్నకుమార్, మున్నార్ తదితరులు పాల్గొన్నారు.



తాడువాయిలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ కంటి వైద్యశాల సిబ్బంది

ఈ కేవైసీ చేయించుకోవాలి

ముప్పాళ్ల: రేషన్ కార్డుదారులందరు ఈ నెల 31వ తేదీ లోపు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దారు ఎం.భవానీశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3,375 రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ పెండింగ్‌లో ఉందని, నెలాఖరు లోపు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

వలస జీవులు!





పశుగ్రాసం కోసం మూగజీవులు జిల్లాలు, ఎల్లలు దాటి వలస వెళుతున్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చంద్రశేఖరపురం నుంచి, ఎర్రగొండపాలెం మండలం పుల్లలచెరువు ఇతర ప్రాంతాల నుంచి రేపల్లె కృష్ణానది పరివాహక ప్రాంతానికి వినుకొండ మీదుగా ఆవులను తోలుకుంటూ పశుపోషకులు వెళుతూ కనిపించారు. తమ ప్రాంతాల్లో కనీస పశుగ్రాసం కూడా లేకపోవడం.. నీటి లభ్యత కూడా కష్టంగా మారడంతో ఆవులను ఇలా వలస తోలుకెళ్తున్నామని పశువుల యాజమానులు వాపోయారు.

– వినుకొండ